సాక్షి
అనకాపల్లి
గురువారం । 9 । మే । 2024



తలసేమియా దినోత్సవం

విశాఖ: ఇంటర్నేషనల్ తలసేమియా డేను పుర స్కరించుకుని రెడ్ క్రాస్ సొసైటీ విశాఖ జిల్లా శాఖ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



పుస్తకాల బహూకరణ

ఏయూ లాకాలేజ్ లైబ్రరీకి తాను రచించిన ఎవిడెన్స్, కాంట్రాక్ట్ యాక్ట్ పుస్తకాలను విశ్రాంత ఆచార్యుడు కేశవరావు బహూకరించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
36.3/23.8

తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కొన్నిచోట్ల కురిసే అవకాశముందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

ప్రాణదాత ఆ పోలీసు



వడ దెబ్బకు గురైన వ్యక్తికి సేవలు అందిస్తున్న ఎస్‌ఐ రమేష్‌బాబు

కశింకోట: వడ దెబ్బకు గురైన వ్యక్తికి తక్షణం ఉపశమన చర్యలు చేపట్టి ఎస్ఐ ప్రాణాలతో కాపాడారు. ఈ సంఘటన బుధవారం స్థానిక బాలికల హైస్కూలు వద్ద జరిగింది. 40 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి వడ దెబ్బకు గురై బాలికల హైస్కూలు వద్ద రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో కింద పడిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ కె.రమేష్‌బాబు అతని వద్దకు చేరుకొని నీరు ఇచ్చి ఉపశమన చర్యలు చేపట్టారు. దీంతో బాధితుడు కొంతసేపటికి తేరుకొని వడ దెబ్బ బారి నుంచి సురక్షితంగా బయటపడ్డాడు. ప్రాణాపాయంలో ఉన్న తనను కాపాడిన ఎస్ఐకు కృతజ్ఞతలు తెలిపి ఇంటి ముఖం పట్టాడు.

అనకాపల్లిలో వైఎస్సార్‌సీపీ భారీ ప్రచార సభ నేడు

అనకాపల్లి: స్థానిక విజయరామరాజుపేట జంక్షన్ వద్ద గురువారం సాయంత్రం 4 గంటలకు భారీ ప్రచార సభ నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు, పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రి, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎంపీ బి.వి.సత్యవతి, నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ పాల్గొననున్నట్టు ఆయన పేర్కొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజుకు గడువు ఈ నెల 10

తుమ్మపాల: ఇంటర్‌మీడియట్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు దరఖాస్తు చేసేందుకు రూ.3 వేల తత్కాల్ ఫీజుతో ఈనెల 10వ తేదీ వరకు అవకాశం కల్పించినట్లు జిల్లా ఇంటర్‌మీడియట్ బోర్డు అధికారి బి.సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష తప్పిన విద్యార్థుల కోసం ఇంటర్ బోర్డు తత్కాల్ అవకాశం కల్పించిందని, ఇప్పటి వరకు అడ్వాన్స్‌డ్ పరీక్షలకు ఫీజు చెల్లించని వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

క్షుణ్ణంగా వాహన తనిఖీలు

- ఎస్పీ మురళీకృష్ణ ఆదేశం

కశింకోట: ఎన్నికల దృష్ట్యా నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తూ వాహన తనిఖీలు క్షుణ్ణంగా నిర్వహించాలని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆదేశించారు. మండలంలోని తాళ్లపాలెంలో పోలీస్ చెక్ పోస్టును, స్టాటిక్ సర్వైలెన్స్ నిర్వహిస్తున్న కార్యకలాపాలను బుధవారం రాత్రి ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. నిష్పక్షపాతంగా, నిబద్ధతతో వ్యవహరిస్తూ వాహన తనిఖీలు నిర్వహించాలన్నారు. తనిఖీ చేసిన ప్రతి వాహన వివరాలను క్లుప్తంగా రిజిస్టర్‌లో పొందుపర్చాలన్నారు. ఎన్నికల దృష్ట్యా రాజకీయ పార్టీల వారు మద్యం, నగదు, బహుమతులు పంపిణీ చేసే అవకాశం ఉందని, వాటిని తరలించేందుకు అక్రమ మార్గాలను అనుసరిస్తుంటారన్నారు. సరైన పత్రాలు లేకుండా రూ.50 వేలకు మించిన నగదు, ఎక్కువ సంఖ్యలో వస్తువులు తరలిస్తే వాటిని స్వాధీనం చేసుకొని సంబంధిత అధికారులకు అప్పగించాలన్నారు. అదనపు ఎస్పీ విజయభాస్కర్, సీఐ ఎం.వినోద్‌బాబు తదితరులు ఆయన వెంట పాల్గొన్నారు.

నూకాంబిక హుండీ ఆదాయం రూ.66.69 లక్షలు



అమ్మవారి హుండీ ఆదాయం లెక్కిస్తున్న దేవదాయ శాఖ సిబ్బంది, భక్తులు

అనకాపల్లి: గవరపాలెంలోని శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయ హుండీ ఆదాయం రూ.66.69 లక్షలు లభించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 22 నుంచి మే 7 తేదీ వరకు హుండీ ద్వారా వచ్చిన కానుకలు, నగదును బుధవారం లెక్కించారు. నగదుతోపాటు భక్తులు అమ్మవారికి సమర్పించిన 31 గ్రాముల బంగారం, కిలో 700 గ్రాముల వెండి లభించింది. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్, జిల్లా దేవదాయశాఖ అధికారి కె.ఎల్.సుధారాణి, అనకాపల్లి దేవదాయ, ధర్మాదాయ శాఖ తనిఖీదారు ఎం.శ్రీధర్‌ల పర్యవేక్షణలో లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు.


అవినీతి కేరాఫ్ అనిత

ప్రజలు తమ ప్రతినిధిగా గెలిపించేది తమ వాణి వినిపిస్తారని.. తమ యోగక్షేమాలు పరిశీలిస్తారని.. సమస్యలుంటే పరిష్కరిస్తారని.. తమకు అండగా నిలబడతారని..

కానీ తమ ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే.. అందరికీ జరగాల్సిన మేలును తానొక్కరే అనుభవిస్తూ, పదవిని అడ్డుపెట్టుకొని అడ్డగోలుగా అక్రమాలు చేస్తూ, తమ సంక్షేమాన్ని విస్మరిస్తే.. ప్రజలు ఏం చేస్తారు? ఛీ పొమ్మని తిరస్కరిస్తారు.

అందుకే 2019లో వంగలపూడి అనితకు చంద్రబాబునాయుడు పాయకరావుపేట టికెట్ ఇవ్వలేదు. పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరులో పోటీ చేయించారు. అక్కడ కూడా ఆమెకు విజయం దక్కలేదు.

ఐదేళ్లయింది కదా తన అక్రమాలను ప్రజలు మరచిపోయి ఉంటారని ఆమె మళ్లీ పాయకరావుపేట వచ్చారు. టీడీపీ తరఫున పోటీ చేస్తున్నారు. కానీ జనం జ్ఞాపకశక్తిని ఆమె తక్కువ అంచనా వేశారు. వారికి అన్నీ గుర్తున్నాయని త్వరలోనే ఆమె తెలుసుకుంటారు.



బినామీ వారసుడికి పరిహారం ఇప్పించేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నించిన రాజయ్యపేట రామాలయం భూములు

చెరువుల్లో తవ్విన మట్టిని లారీల్లో లేఅవుట్ల వ్యాపారుల కోసం తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

- గత టీడీపీ ప్రభుత్వంలో రూ.కోట్లలో అవినీతి
- ఐదేళ్లలో 600 ఎకరాలు హాంఫట్
- వెబ్ ల్యాండ్‌లో మార్పులు.. భారీగా వసూళ్లు
- భోంచేసిన భూముల విలువ రూ.200 కోట్లు
- నీరు-చెట్టులో రూ.6 కోట్లు పక్కదారి
- సీసీ రోడ్ల పనుల్లో రూ.50 కోట్లు మింగేశారు
- మరుగుదొడ్లలో రూ.15 కోట్ల అవినీతి కంపు

సాక్షి, అనకాపల్లి:

గత టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లలో పాయకరావుపేటలో అభివృద్ధి జరిగింది చిటికెడు అయితే.. అవినీతి, అక్రమాలు కొండంత. భూ దందాలు, నిర్మాణ పనుల్లో వాటాలు, పైరవీలు.. ఇలా ఎన్నో ఎన్నెన్నో.. 2014లో అనిత 2,828 ఓట్ల స్వల్ప మెజారిటీతో గెలిచారు. సామాన్య మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన ఆమె తమకు మేలు చేస్తారని ఆశించిన ఓటర్లకు కొద్ది కాలంలోనే ఆమె కంగు తినిపించారు. అక్రమాలకు, అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారు. పాయకరావుపేట నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఎప్పుడూ లేనంతగా భారీ అవినీతి, భూఆక్రమణలకు పాల్పడ్డారు. వెబ్‌ల్యాండ్‌లో మార్పులతో భారీగా వసూలు చేశారు. టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న ఐదేళ్లలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఆమె చేసిన అక్రమాలు అన్ని ఇన్నీ కావు. వందల కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతం చేయడమే కాదు.. కోట్ల విలువైన అభివృద్ధి పనులను నామినేషన్ పద్ధతిలో పంచేసుకుని సొమ్ము చేసుకున్నారు. ఇసుకను దోచేశారు. మట్టిని కాజేశారు. మరుగుదొడ్ల నిధులు మెక్కేశారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని డబ్బులు దోచుకున్నారు. నీరు-చెట్టు పథకంలో పనులు చేయకుండానే బిల్లులు స్వాహా చేయడం, డబుల్ ధమాకా పేరుతో చెరువు తవ్వకాల్లో వచ్చిన మట్టిని రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు విక్రయించడం, తాండవ, వరాహ నదుల్లో ఇసుకను అక్రమంగా తవ్వకాలు జరిపి కంపెనీలకు విక్రయించడం, భూరికార్డులను ట్యాంపరింగ్ చేయడం, ప్రభుత్వ భూములకు పట్టాలు లేకుండానే నకిలీ పట్టాలు పుట్టించి పాసు పుస్తకాల్లో నమోదు చేయించుకోవడం, ఈ భూములకు ప్రభుత్వం నుంచి కోట్లాది రూపాయలు పరిహారం పొందేందుకు స్కెచ్ వేయడం.. ఇలా అనేక అక్రమాలకు పాల్పడ్డారు.

జన్మభూమి కమిటీలతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను అర్హులైన వారికి కేటాయించకుండా లక్షలాది రూపాయలు లంచాలు ఇచ్చిన వారికే అమ్మేసుకున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇక రేషన్ డిపోలు, అంగన్వాడీ ఆయా, కార్యకర్తల పోస్టులు కూడా ఇలాగే అమ్మేసుకున్నారు. మరుగుదొడ్లు, పక్కా గృహాలు, పింఛన్ల మంజూరు వంటి పథకాల అమలులో కూడా లబ్ధిదారుల నుంచి లక్షలాది రూపాయలు గుంజేశారు.

నీరు-చెట్టు పథకంలోనూ దోపిడీయే...
అవినీతి విలువ రూ.6 కోట్లు
మట్టి విక్రయాల ద్వారా మరో రూ.25 కోట్లు

అప్పటి టీడీపీ ప్రభుత్వంలో నీరు-చెట్టు పథకం కింద పాయకరావుపేట నియోజకవర్గంలో నాలుగేళ్లలో సుమారు రూ.12 కోట్ల విలువైన పనులు జరిగాయి. వీటిలో రూ.6 కోట్ల వరకు అప్పటి టీడీపీ ఎమ్మెల్యే అనిత బుక్కేశారన్న విమర్శలున్నాయి. ఎస్.రాయవరం, కోటవురట్ల, పాయకరావుపేట మండలాల్లో ఇలా కోట్లాది రూపాయల నిధులు పక్కదారి పట్టాయి. కోటవురట్లలో ఊర చెరువు, జల్లూరులో నాగన్న చెరువు, ఎస్.రాయవరం మండలం రామయ్యపట్నంలో జగ్గరాజు చెరువు, పెదగుమ్ములూరులో రాతి చెరువు, పెద ఉప్పలం చెరువు అప్పలరాజు చెరువులలో పనులు జరగపోయినా జరిగినట్లు చూపించి మోసం చేశారు. మట్టి విక్రయాల ద్వారా రూ.25 కోట్ల అవినీతి జరిగింది.

ఇసుక నుంచి కోట్లు పిండేశారు..

సుమారు రూ.50 కోట్ల విలువైన ఇసుక తరలింపు స్థానిక ప్రజాప్రతినిధి అండదండలు చూసుకుని టీడీపీ నాయకులు ఇసుక నుంచి కోట్లు పిండేశారు. తాండవ, వరాహ నదుల్లో దార్లపూడి, పందూరు, గొట్టివాడ, గుమ్ములూరు, పెదఉప్పలం, పెనుగొల్లు, ధర్మవరం, సోముదేవుపల్లి సత్యవరం, పెంటకోట, మాసయ్యపేట, అరట్లకోట తదితర ప్రాంతాల నుంచి లక్షలాది క్యూబిక్ మీటర్ల ఇసుకను అక్రమంగా తవ్వేశారు. సుమారు రూ.50 కోట్ల విలువైన ఇసుకను కొల్లగొట్టడం ద్వారా నాలుగు మండలాల ముఖ్య నాయకులు సుమారు రూ.20 కోట్ల మేర లాభాలు ఆర్జించారు.

సీసీ రోడ్లలో సుమారు రూ.50 కోట్ల అవినీతి
మరుగుదొడ్లలో రూ.15 కోట్లు స్వాహా

టీడీపీ ప్రభుత్వంలో పాయకరావుపేట నియోజకవర్గంలో వివిధ గ్రామాల్లో సుమారు 300 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు నిర్మించారు. ఆర్థిక సంఘ నిధులు దాదాపుగా సుమారు రూ.300 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులన్నీ టీడీపీకి చెందిన సర్పంచ్‌లు, ముఖ్య నాయకులే చేపట్టారు. నాణ్యతాలోపంతో పనులు చేసి రూ.50 కోట్ల నిధులు స్వాహా చేశారు. అలాగే నియోజకవర్గానికి 25 వేల మరుగుదొడ్లు మంజూరైతే.. వాటికి రూ.37 కోట్లు విడుదల చేశారు. ఒక్కొక్క దానికి రూ.15 వేలు కేటాయించారు. వీటిని నిర్మించే బాధ్యత తెలుగుదేశం నాయకులే తీసుకున్నారు. వీటిలో సగం మరుగుదొడ్లు బినామీలకే మంజూరు చేశారు. ఇందులో ఇలా రూ.15 కోట్ల వరకు అవినీతి జరిగినట్లు తెలుస్తోంది.

600 ఎకరాల్లో భూ కుంభకోణాలు
విలువ సుమారు రూ.200 కోట్లు

టీడీపీ హయాంలో అనిత నేతృత్వంలో నియోజకవర్గంలో సుమారు 600 ఎకరాల్లో భూకుంభకోణాలకు పాల్పడ్డారు. వెబ్‌ల్యాండ్‌లో మార్పుల పేరిట భారీగా వసూళ్లకు పాల్పడ్డారు. సబ్ డివిజన్-2లో సుమారు రూ.10 కోట్ల విలువైన 4.40 ఎకరాల ప్రభుత్వ భూమిని జిరాయితీగా పేర్కొంటూ మరో ముగ్గురి పేరున వన్ బీ, ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ల్యాండ్ సీలింగ్ పేరిట టీడీపీ నాయకులు భారీగా ఆక్రమణలకు పాల్పడ్డారు. అమలాపురంలో 105 ఎకరాల భూముల్లో రూ.22 కోట్లు, రాజయ్యపేటలో 19 ఎకరాల్లో రూ.5 కోట్లు, నెల్లిపూడిలో 42 ఎకరాల్లో రూ.15 కోట్లు, గుర్రాజుపేటలో రూ.3 కోట్లతో 10 ఎకరాల అవినీతికి పాల్పడ్డారు.

బుద్ధి చెప్పేందుకు సిద్ధం

మంచి చేస్తే ఆదరించే పాయకరావుపేట ప్రజలు.. అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిని ఓడించి బుద్ధి చెబుతారు. అందుకే 2019 ఎన్నికల్లో టీడీపీని ఓడించి 31,189 ఓట్ల భారీ మెజారిటీతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గొల్ల బాబూరావును గెలిపించారు. ఇప్పుడు మళ్లీ పాయకరావుపేట నియోజకవర్గ ప్రజలను మోసం చేసేందుకు, దోచుకునేందుకు టీడీపీ నుంచి మరోసారి పోటీ చేస్తున్న వంగలపూడి అనితను ఓడించడానికి పాయకరావుపేట నియోజకవర్గ ప్రజలు సంసిద్ధంగా ఉన్నారు.

జిల్లాలో 14,162 వేల మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగం

- 3వ రోజు ప్రశాంతంగా పోలింగ్
- పోలీస్, కేంద్ర బలగాలు, రిటైర్డ్ అధికారులకు నేడు అవకాశం

తుమ్మపాల: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ మూడో రోజు బుధవారం ప్రశాంతంగా జరిగింది. ఎన్నికల విధుల్లో పాల్గొనే అన్ని శాఖల ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. గురువారం కూడా పలు శాఖలు, ఎంసీసీ, పోలీస్, ఎన్నికల విధుల్లో ఉన్న రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునేందుకు జిల్లా యాంత్రాగం ఏర్పాటు చేసింది.

- జిల్లాలో తొలి రోజు 5,128 మంది, రెండో రోజు 6,506 మంది, మూడో రోజు 2,528 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 14,162 మంది ఇప్పటి వరకు ఓటు వేశారు.
- అత్యవసర సేవలకు చెందిన 2,340 మంది సిబ్బందికిగాను మంగళవారం నాటికి 1,866 మంది, బుధవారం మిగిలిన వారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటును వినియోగించుకున్నారు.

ప్రశాంతంగా ముగిసిన హోమ్ ఓటింగ్...

జిల్లాలో 85 ఏళ్ల వయస్సు దాటిన వృద్ధులు, 40 శాతం వైకల్యం కలిగిన వారు ప్రభుత్వం కల్పించిన హోమ్ ఓటింగ్ హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలో వృద్ధులు 365 మంది, దివ్యాంగులు 635 మంది మొత్తం వెయ్యి మంది దరఖాస్తు చేసుకోగా, ఈ నెల 3 నుంచి 8వ తేదీ వరకు ఓటింగ్ జరిగింది. మంగళవారం 353 మంది వృద్ధులు, 600 మంది దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. బుధవారం పూర్తిస్థాయిలో హోమ్ ఓటింగ్ జరిగింది. జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లోనూ 34 బృందాలు ఇంటింటికీ వెళ్లి బ్యాలెట్ పేపర్లు అందించి ఓటు నమోదు అనంతరం బాక్సుల్లో వేయించింది. ఒక్కో బృందంలో బీఎల్‌వో, పోస్టల్ బ్యాలెట్ ఇన్‌చార్జి, గెజిటెడ్ అధికారి, మార్కెడ్ కాపీ ఇన్‌చార్జి, మైక్రో అబ్జర్వర్‌తో హోమ్ ఓటింగ్ ప్రక్రియ మొత్తాన్ని వీడియోగ్రాఫర్ చిత్రీకరించారు.

ఈ పాపం ఎవరిది?

- పెన్షన్ కోసం తిరిగి ప్రాణం విడిచిన మహిళ



మృతురాలు తోలాటి పద్మావతి

చోడవరం రూరల్: పెన్షన్ల పంపిణీ విషయమై ప్రతిపక్షం కుతంత్రానికి మరో ప్రాణం బలైంది. చోడవరం మండలం అంభేరుపురం గ్రామానికి చెందిన తోలాటి పద్మావతి (54)కి వితంతు పింఛన్‌ను ప్రతి నెల వలంటీరు ద్వారా వచ్చేది. ఈసారి సొమ్ము బ్యాంకులో వేయడంతో ఆమె మే 2న పాస్‌బుక్ తీసుకొని గోవాడ స్టేట్ బ్యాంక్‌కు వెళ్లింది. ఆ ఖాతా భర్త ఆచారితో కలిసి తీసుకున్న జా యింట్ అకౌంట్ కావడంతో అందులో జమైన పింఛన్ సొమ్ము తీసుకోవడానికి గాను భర్త డెత్ సర్టిఫికెట్ అవసరమైంది. ఆ సర్టిఫికెట్ తీసుకురావాలని బ్యాంక్ సిబ్బంది ఆమెకు సూచించారు. మంగళవారం ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడు గోవింద ఆమె భర్త మరణ ధ్రువపత్రాన్ని ఇప్పించాలని సచివాలయ ఉద్యోగులను కోరారు. ఇంతలో బుధవారం ఉదయానికి పద్మావతి నిద్దట్లోనే ప్రాణాలు విడిచారు. వారం రోజులపాటు ఎండలో తిరగడం వల్ల ఆమె బాగా వడలిపోయారని స్థానికులు చెప్పారు. ఆమెకు ఎంపీటీసీ గోవింద, తన అనుచరుడు పిల్లి రవితో కలిసి దహన సంస్కారాలు నిర్వహించారు.

సికింద్రాబాద్-ఖుర్దారోడ్ మధ్య స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం : వేసవి సీజన్‌లో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సికింద్రాబాద్-ఖుర్దారోడ్-సికింద్రాబాద్ మధ్య పలు స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు.

- సికింద్రాబాద్-ఖుర్దారోడ్(07129) సమ్మర్ స్పెషల్ ఈ నెల 10న సాయంత్రం 6.20 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 9.02 గంటలకు బయల్దేరి శనివారం సాయంత్రం 4.30 గంటలకు ఖుర్దారోడ్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఖుర్దారోడ్-సికింద్రాబాద్(07130) సమ్మర్ స్పెషల్ శనివారం రాత్రి 11.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 7.15 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 7.17 గంటలకు బయల్దేరి ఆదివారం రాత్రి 10 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.



- సికింద్రాబాద్-ఖుర్దారోడ్(07131) మరో సమ్మర్ స్పెషల్ ఈ నెల 11న సాయంత్రం 6.20 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 9.02 గంటలకు బయల్దేరి ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు ఖుర్దారోడ్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఖుర్దారోడ్-సికింద్రాబాద్(07132) సమ్మర్ స్పెషల్ ఈ నెల 12వ తేదీ రాత్రి 11.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 7.15 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడి నుంచి 7.17 గంటలకు బయల్దేరి సోమవారం రాత్రి 10 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

ఎన్నికల విధుల్లో ట్రైనీ ఐపీఎస్ అధికారులు



ఎన్నికల బందోబస్తు, భద్రత, నియమావళిపై ట్రైనీ ఐపీఎస్‌లకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

తుమ్మపాల :

నేషనల్ పోలీస్ అకాడమీ చెందిన 9 మంది ట్రైనీ ఐపీఎస్‌లు ఎన్నికల నియమ నిబంధనలపై అవగాహన కోసం జిల్లాలో సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనున్నారు. ఈ మేరకు ట్రైనీ ఐపీఎస్‌లు అర్జున్ గుప్తా, అర్పిత్ ఆర్ పారేక్, శుభాన్సు కత్యార్, హర్షిత్ గోయల్, హుస్సేన్ లిరార్, జతిన్ జైన్, గౌతమ్ వివేకానందన్, పెమ తిన్లే, వైభవ్ రావత్‌లకు జిల్లాలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియ గూర్చి ఎస్పీ కె.వి.మురళీకృష్ణ, అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో బుధవారం అవగాహన కల్పించారు. ఈ నెల 8 నుండి 13 వరకు జిల్లా పరిధిలో జరిగే ఎన్నికల ప్రక్రియ గురించి క్షేత్ర స్థాయిలో పర్యటించి తెలుసుకుంటారన్నారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికల్లో బందోబస్తు విధుల్లో భాగంగా నియోజకవర్గాల్లోని స్థానిక పోలీసులు, పారా మిలటరీ దళాలతో కవాతు నిర్వహించడం, సెక్టర్ మొబైల్, ఫ్లయింగ్ స్క్వాడ్, నిఘా బృందాలతో పని చేయడం, కంట్రోల్ రూమ్, చెక్ పోస్టులను, పోలింగ్ బూత్, కౌంటింగ్ సెంటర్, ఈవీఎం నిల్వ కేంద్రాలను సందర్శించడం, ఎన్నికల అబ్జర్వర్, వ్యయ పరిశీలక అధికారులతో సమావేశం అవుతారన్నారు.

ఎలక్షన్ సెల్, పోలీస్ కంట్రోల్ రూమ్ సందర్శించడం జరిగిందన్నారు. మొత్తం ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ రోజు జరిగే వివిధ బందోబస్తు ఏర్పాట్లను గమనించి, నేర్చుకునేలా చేయడం, బలగాల సమీకరణ, మోహరింపు, భద్రత సమస్యలను పరిష్కరించడం, సివిల్, పోలీస్ పరిపాలన సమర్థంగా నిర్వహించడం వంటి విషయాల్లో శిక్షణలో ట్రైనీ ఐపీఎస్ అధికారులు పాల్గొంటారని ఎస్పీ తెలిపారు.

ప్రచార పర్వం





కె.కోటపాడు : ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ ప్రచారంలో దూసుకుపోతున్నారు. కె.కోటపాడులో ఆమె నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



చోడవరం: ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ గ్రామాలను చుట్టేస్తున్నారు. గోవాడ, వెంకన్నపాలెం, అంబేరుపురం తదితర ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా ప్రచారం చేశారు.



పాయకరావుపేట: ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు తన ప్రచారంలో అన్ని వర్గాల ప్రజలను కలుస్తున్నారు. ఈ సందర్భంగా సీతారాంపురంలో తప్పెటగుళ్లు ఆడారు.



అనకాపల్లి: ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ ప్రచారం స్పీడ్ పెంచారు. వేల్పుల వీధిలో ఎంపీ బి.వి.సత్యవతితో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు.



నర్సీపట్నం: ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేష్ జోరుగా ప్రచారం చేస్తున్నారు. నర్సీపట్నం మండలం వేములపూడిలో ఇంటింటా ప్రచారం చేశారు.



యలమంచిలి: ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తి రాజు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. యలమంచిలి మున్సిపాలిటిలో సోమలింగపాలెంతో పాటు పలు గ్రామాల్లో ప్రచారం జరిపారు.

పాలిసెట్ ఫలితాల్లో నంబర్ 1

- మెరిసిన విశాఖ విద్యార్థులు
- రాష్ట్ర స్థాయిలో ఇద్దరికి ఒకటో ర్యాంకు
- టాప్ టెన్ ర్యాంకుల్లో ముగ్గురికి చోటు
- 12,147 మందిలో 10,813 మంది ఉత్తీర్ణత



పాలిటెక్నిక్ శిక్షణలో విద్యార్థులు

విశాఖ విద్య/తగరపువలస: పాలిటెక్నిక్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష(పాలిసెట్–2024)లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. జిల్లాకు చెందిన ఎక్కువ మంది విద్యార్థులు అర్హత సాధించడంతో పాటు ర్యాంకుల సాధనలోనూ టాప్‌లో నిలిచారు. సాంకేతిక విద్యాశాఖ అధికారులు బుధవారం పాలిసెట్ ఫలితాలు ప్రకటించారు. జిల్లా నుంచి 12,147 మంది ప్రవేశ పరీక్షకు హాజరు కాగా.. వీరిలో 10,813 మంది అర్హత సాధించారు. తద్వారా జిల్లాలో 89.02 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. బాలబాలికల వారీగా చూసినట్లైతే 7,265 మంది బాలురు పరీక్ష రాయగా, 6,379 మంది (87.80 శాతం) అర్హత సాధించారు. 4,882 మంది బాలికలు పరీక్ష రాయగా, వీరిలో 4434 మంది (90.82 శాతం)ఉత్తీర్ణులయ్యారు. పాస్ పర్సంటేజీలో రాష్ట్ర సగటు 87.61 శాతం కాగా.. విశాఖ జిల్లాలో అంతకుమించి(89.02 శాతం) ఉత్తీర్ణత నమోదు చేసుకోవడం విశేషం. ఈ ఏడాది రాష్ట్రంలో జిల్లా నుంచే ఎక్కువ మంది పాలిసెట్‌కు హాజరుకాగా.. అదే స్థాయిలో అర్హత సాధించడం విశేషం. సిరినివాస్ అన్నమరాజు నగర్(కొమ్మాది)కు చెందిన పోతుల జ్ఞాన హర్షిత, సంగివలస శశి స్కూల్ విద్యార్థి శీలం శ్రీరామ్ భవదీప్‌లు రాష్ట్రస్థాయి ఒకటో ర్యాంకు కైవసం చేసుకున్నారు. శీలం ఐశ్వర్య రాష్ట్ర స్థాయిలో ఏడో ర్యాంకు దక్కించుకుంది.

జిల్లాలో 6,730 సీట్లు

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని 15 పాలిటెక్నిక్ కాలేజీల్లో 6,730 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అత్యధికంగా మెకానికల్ 1,716 సీట్లు, ఆ తర్వాత సీఎంఈ 1,419, ఈఈఈ 1,321, ఈసీఈ బ్రాంచిలో 990 సీట్లు ఉన్నాయి. జిల్లా విద్యార్థులకు టాప్ కాలేజీల్లోనే సీట్లు లభిస్తాయని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ కె.నారాయణరావు వెల్లడించారు.

ప్రసిద్ధ ఐఐటీలో చదువుతా..



పాలిసెట్‌లో 120 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ వచ్చింది. సీబీఎస్‌ఈ 10వ తరగతి పరీక్షలు రాసి ఫలితాల కోసం వేచి చూస్తున్నాను. దేశంలోనే పేరు పొందిన ఐఐటీలో చదవాలనుకుంటున్నాను. మా నాన్న అప్పలనాయుడు బోయిపాలెం జెడ్పీ హైస్కూల్‌లో సోషల్ అసిస్టెంట్‌గా, అమ్మ ప్రగతి చోడవరం నీటి పారుదల శాఖలో డివిజనల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. సబ్జెక్టుపై అవగాహన కారణంగా ప్రత్యేకంగా ప్రిపేర్ కాలేదు.

– పోతుల జ్ఞానహర్షిత, కొమ్మాది

ఐఐటీ ముంబయిలో సీటు సాధిస్తాను



పాలిసెట్‌లో 120 మార్కులతో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు వచ్చింది. 10వ తరగతి పరీక్షల్లో 582 మార్కులు సాధించాను. సంగివలస శశిలో చదివాను. ఇక్కడే ఇంటర్ చదువుతా. మా నాన్న శ్రీను ప్రస్తుతం తుని మండలం ఎస్.అన్నవరం సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండగా తల్లి ఫణిశ్రీ గృహిణి.

– శీలం శ్రీరామ్ భవదీప్, పాయకరావుపేట

ఐఐటీ కాన్పూర్‌లో చదవాలన్నదే లక్ష్యం



పాలిసెట్‌లో 119 మార్కులతో రాష్ట్రస్థాయిలో 7వ ర్యాంకు లభించింది. సంగివలస శశి స్కూల్‌లో 10వ తరగతి పూర్తి చేశాను. 590 మార్కులు వచ్చాయి. ఇంటర్మీడియట్ ఇక్కడే చదువుతాను. మా నాన్న శ్రీనివాసరావు శశిలోనే అధ్యాపకుడిగా ఉన్నారు. తల్లి శిరీష ఎమ్మెస్సీ పూర్తి చేశారు.

– శీలం ఐశ్వర్య, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా

సైబర్ ఇన్వెస్టిగేషన్ ల్యాబ్ ప్రారంభం



సైబర్ ఇన్వెస్టిగేషన్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న పోర్టు చైర్మన్ అంగముత్తు, సీపీ రవిశంకర్

అల్లిపురం: నగర పోలీసు కమిషనరేట్‌లో పోర్టు సీఎస్సార్ నిధులతో నూతనంగా నిర్మించిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆన్ సేఫ్టీ (సైబర్ ఇన్వెస్టిగేషన్ ల్యాబ్)ను పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు ప్రారంభించారు. బుధవారం కమిషనరేట్‌లో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఏ.రవిశంకర్ సమక్షంలో పోర్టు చైర్మన్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం ఆయనకు నగర శాంతి భద్రతలు పర్యవేక్షిస్తున్న తీరును ప్రత్యక్షంగా వివరించారు. నూతనంగా ఏర్పాటు చేసిన బాడీ వార్న్ కెమెరాల మానటరింగ్ విధానం, కంట్రోల్ రూమ్ పనితీరును ఆయనకు వివరించారు. దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దిశా దివ్యాంగ్ సురక్ష హెల్ప్ లైన్ విధానాన్ని వివరించారు. జేసీపీ ఫకీరప్ప మాట్లాడుతూ నూతనంగా ప్రారంభించిన ల్యాబ్ సైబర్ క్రిమినల్స్‌ను పట్టుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సైబర్ ల్యాబ్ ఏర్పాటుకు నిధులు అందజేసిన పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం. అంగముత్తుకు పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు.

12 మద్యం సీసాలు పట్టివేత

కశింకోట: మండలంలోని బయ్యవరం వద్ద చిల్లర దుకాణంలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని బుధవారం రాత్రి స్టాటిక్ సర్వైలెన్స్ బృందం పట్టుకుంది. 11 క్వార్టర్ మద్యం సీసాలు, ఒక ఫుల్ బాటిల్‌ను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు అప్పగించింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ఎం. వినోద్‌బాబు తెలిపారు.

ఏలేరు కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం



కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వద్ద ఏలేరు కాలువలో గుర్తుతెలియని మహిళ(55) మృతదేహాన్ని కనుగొన్నట్టు సీఐ ఎం.వినోద్‌బాబు తెలిపారు. ఎగువ ప్రాంతం నుంచి కొట్టుకొని రావడంతో స్థానికులు గుర్తించి సమాచారం అందించారన్నారు. సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కాలువ నుంచి వెలికి తీశామన్నారు. ఎటువంటి ఆధారాలు లభించలేదని చెప్పారు. మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని సీఐ తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



ఎమ్మెల్యే రమణమూర్తిరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న మంగళవరపుపేట జనసేన కార్యకర్తలు



టీడీపీ, జనసేన నాయకులను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్

మునగపాక: ఎన్నికల సమయం దగ్గరపడుతున్న వేళ పలు పార్టీల నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు జోరందుకున్నాయి. మండలంలోని మంగళవరపుపేటలో జనసేనకు షాక్ తగిలింది. పలువురు జనసేన కార్యకర్తలు బుధవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కాండ్రేగుల చందు, వైఎస్సార్‌సీపీ నేతలు ఆడారి త్రిమూర్తులు, సరిసా శ్రీనుల ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలోచేరారు. పార్టీలో చేరిన వై.నవీన్, ఎ.పవన్, జె.జగదీష్, వై.కార్తీక్, ఎ.కిరణ్,ఎస్.వంశీ, ఎస్.జగన్, కె.జగదీష్,లోకేష్,నరసింహమూర్తి తదితరులకు ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా రమణమూర్తిరాజు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి హయాంలోనే మేలు జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావడం ఖాయమన్నారు. చంద్రబాబు అండ్ కో మోసాలనునమ్మకుండా ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమారవర్మ పాల్గొన్నారు.

అచ్యుతాపురం: మండలంలోని ఆవసోమవరం, నడింపల్లి,జీపీ అగ్రహారం, పూడిమడక శివారు జాలారివానిపాలెంకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆవసోమవారానికి చెందిన తుమ్మల శ్రీహరి,ముప్పెన అప్పారావు, బోధన అర్జునరావు, పలివెల రమణ తదితరులు, నడింపల్లి, జీపీ అగ్రహారానికి చెందిన యాండ్ర కనకరాజు, పోలవరపు నాగరాజు,బండి నరసింగరావు,రెడ్డి నూకరాజు, పూడిమడక శివారు జాలారివానిపాలెంలో టీడీపీకి చెందిన నాల్గవ వార్డు మెంబర్ మద్దు లక్ష్మణ్, పోలిశెట్టి కోదండ,మద్దు రాజు తదితరులకు ఎమ్మెల్యే యు.వి.రమణ మూర్తి రాజు పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సర్పంచ్ కోలా అప్పలరాజు, ఈతబాబు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి

అనకాపల్లి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి వేల్పులవీధి యువకులు, మహిళలు టీడీపీ, జనసేనలను వీడి బుధవారం వైఎస్సార్‌సీపీలోకి చేరారు. స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఆలయ సమీపంలో పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు–1 ఉగ్గిన అప్పారావు ఆధ్వర్యంలో పార్టీలోకి చేరిన 60మందికి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి ఆహ్వానించారు. 83 వార్డు కార్పొరేటర్ జాజుల రమేష్, పార్టీ నాయకులు బొండా శంకరరావు, మద్దాల రమణబాబు, వేల్పుల గణేష్, మద్దాల చలపతి, జెట్టిశ్రీను పాల్గొన్నారు.

150 మంది చేరిక..

పాయకరావుపేట: పీఎల్ పురంలో టీడీపీ, జనసేనకు చెందిన 150 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. పీఎల్ పురం సర్పంచ్ పడాల దివాణం ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షులు చిక్కాల రామారావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు పాల్గొన్నారు.



ప్రచార రథంపై పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి రాజు



వైఎస్సార్‌సీపీలో చేరిన జాలారివానిపాలెం వాసులతో ఎమ్మెల్యే రమణమూర్తి రాజు



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు

సింహగిరి.. భక్త ఝరి

- గంధం అమావాస్యకు పోటెత్తిన భక్తులు
- అప్పన్న ప్రతిరూపాలుగా కోలలకు పూజలు

సింహాచలం: గంధం అమావాస్యను పురస్కరించుకుని బుధవారం సింహగిరికి భక్తులు పోటెత్తారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఇలవేల్పుగా పూజించే ఉత్తరాంధ్ర జిల్లాల్లోని మత్స్యకారులు, గ్రామీణ ప్రాంత భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. మంగళవారం రాత్రికే సింహాచలం చేరుకున్న వీరంతా బుధవాం తెల్లవారుజామున కొండదిగువ వరాహ పుష్కరిణిలో స్నానాలు ఆచరించారు. స్వామివారి ప్రతిరూపాలుగా వెంట తీసుకొచ్చిన కోలలను పుష్కరిణి గట్టుపై ఉంచి పూజలు చేశారు. వంటలు వండి కోలలకు ఆరగింపు చేశారు. అమృత కలశాలు, పండ్లు సమర్పించారు. కుటుంబసమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. మెట్ల మార్గం ద్వారా సింహగిరి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. గరిడీ నృత్యాలు చేస్తూ స్వామిని కీర్తించారు. పుష్కరిణి నుంచి అడవివరం మార్కెట్ కూడలి వరకు ఉన్న మార్గం భక్తజన సంద్రంగా మారింది. సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. పుష్కరిణి వద్ద గోపాలపట్నం పోలీసులు, దేవస్థానం గార్డులు బందోబస్తు నిర్వహించారు.

రేపే అప్పన్న చందనోత్సవం

- లక్ష మంది భక్తులు వస్తారని అంచనా
- తెల్లవారుజామున 4 గంటల నుంచి సర్వ దర్శనం ప్రారంభం
- సాయంత్రం 6 గంటల తర్వాత సింహగిరిపైకి భక్తులకు అనుమతి లేదు
- రూ.300, రూ.1000, రూ.1500 టికెట్ల వారికి దర్శన సమయాల స్లాట్‌లు

సింహాచలం: వరాహ, నారసింహ రూపాలను ఒక్కటిగా చేసుకుని సంవత్సరమంతా చందనం మణుగుల్లో నిత్యరూపంలో దర్శనమిచ్చే సింహాద్రినాథుడి నిజరూప దర్శనం లభించే సమయం ఆసన్నమైంది. వైశాఖ శుద్ధ తదియను పురస్కరించుకుని సింహగిరిపై కొలువైన శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి చందనోత్సవం శుక్రవారం జరగనుంది. ఏడాదిలో కేవలం ఒక్క రోజులోని కొన్ని గంటలు మాత్రమే లభించే ఈ అరుదైన దర్శనాన్ని చేసుకునేందుకు భక్తులు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది. స్వామిని దర్శించుకునేందుకు వచ్చే సాధారణ భక్తులకే పెద్దపీట వేస్తూ.. వారికి దర్శనాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విశాఖ కలెక్టర్ ఎ.మల్లికార్జున, సింహాచలం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎన్నికల నియమావళి అమలులో ఉండటంతో ఈసారి ప్రోటోకాల్ దర్శనాలు ఇవ్వడం లేదు.

వెండి బొరుగులతో చందనం ఒలుపు

చందనోత్సవం పురస్కరించుకుని శుక్రవారం తెల్లవారుజామున ఒంటి గంట నుంచి పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం ఆలయ అర్చకులు వైదిక కార్యక్రమాలు ప్రారంభిస్తారు. సుప్రభాతసేవ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రుత్విగ్వరణం, కలశారాధన చేస్తారు. అనంతరం వెండి బొరుగులతో స్వామిపై ఉన్న చందనాన్ని తీసి నిజరూపభరితుడిని చేస్తారు. తెల్లవారుజామున 3.30 గంటల నుంచి 4.30 గంటల వరకు దేవస్థానం అనువంశిక ధర్మకర్త కుటుంబ సభ్యులు, దాతలు, జ్యుడీషియల్‌కు అంతరాలయ దర్శనాలు కల్పిస్తారు. తదుపరి అంతరాలయ దర్శనాలు నిలిపివేస్తారు. అందరికీ ఆలయ నీలాద్రిగుమ్మం వద్ద నుంచే లఘు దర్శనం కల్పిస్తారు. ఎలాంటి పూజలు, ఆశీర్వచనాలు ఉండవు.

దర్శన స్లాట్‌లు కేటాయింపు

ఉదయం 4 గంటల నుంచి ఉచిత దర్శనం, రూ.300, రూ.1000 క్యూల్లో ఉన్న భక్తులకు దర్శనాలు ప్రారంభిస్తారు. ఉదయం 5.30 గంటల నుంచి రూ.1,500 క్యూలో ఉన్న భక్తులకు దర్శనాలు కల్పిస్తారు. రూ.300 టికెట్లకు సంబంధించి ఉదయం 4 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు, రూ.1000 టికెట్లకు సంబంధించి ఉదయం 4 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు, రూ. 1,500 టికెట్లకు సంబంధించి ఉదయం 5.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు దర్శన టైమ్ స్లాట్‌లు కేటాయించారు.

లక్ష మంది భక్తులు వస్తారని అంచనా

ఈ సారి లక్ష మంది భక్తులు చందనోత్సవానికి వస్తారని అధికారులు అంచనా వేశారు. అందుకు తగ్గట్టుగా రూ.300 టికెట్లు 20 వేలు, రూ.1000 టికెట్లు 15 వేలు, రూ.1500 టికెట్లు 5 వేలు కలిపి మొత్తం 40 వేలు టికెట్లు మాత్రమే విక్రయించారు. 60 వేల మందికి ఉచిత దర్శనం ఏర్పాటుచేసేలా ఏర్పాట్లు చేశారు.

రాత్రి 7 గంటల తర్వాత గేట్లు మూసివేత

10వ తేదీ శుక్రవారం రాత్రి 7 గంటల్లోపు మాత్రమే సింహగిరిపై దర్శనాల క్యూల్లోకి భక్తులను అనుమతిస్తారు. రాత్రి 7 గంటలకు క్యూల ప్రవేశ ద్వారాలు మూసివేసి అప్పటి వరకు క్యూల్లో ఉన్న భక్తులకు స్వామి దర్శనం కల్పిస్తారు. సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే సింహగిరిపైకి బస్సుల్లో భక్తులను అనుమతిస్తారు. ఆ తర్వాత ఖాళీ బస్సులను కొండపైకి పంపించి కొండపై ఉన్న భక్తులను కొండ దిగువకి చేరుస్తారు. 9వ తేదీ గురువారం సాయంత్రం 6 గంటల తర్వాత కూడా భక్తులను కొండపైకి అనుమతించరు.

ఏర్పాట్లు ఇలా..

- సింహగిరికి డ్యూటీలో ఉన్న వారికి మాత్రమే పరిమితంగా పాస్‌లు అందిస్తారు.
- ఈ సారి అడవివరంలోని గురుకుల పాఠశాలకు సమీపంలోని రెండవ ఘాట్ రోడ్డు నుంచే బస్సులు సింహగిరికి వెళ్లేలా, తొలి ఘాట్‌రోడ్డులో బస్సులు కిందకు దిగేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.
- 10వ తేదీ తెల్లవారుజాము ఒంటి గంట నుంచి పాత గోశాల జంక్షన్, పాత అడవివరం జంక్షన్‌ల నుంచి దేవస్థానం ఏర్పాటు చేసిన బస్సుల్లో మాత్రమే సింహగిరిపైకి భక్తులను అనుమతిస్తారు. దేవస్థానం అద్దె చెల్లించిన 45 ఆర్టీసీ బస్సులు, మరో 40 మినీ బస్సులు, 10 ఇన్నోవాల్లో భక్తులను రెండవ ఘాట్‌లో నుంచి ఉచితంగా సింహగిరికి చేరుస్తారు. తొలి ఘాట్‌రోడ్డులో నుంచి కిందకి తీసుకొస్తారు. ఉచిత దర్శనం, 300 టికెట్లు వారికి 45 ఆర్టీసీ బస్సులు, రూ.1000, రూ.1500 టికెట్లు ఉన్న వారికి 40 మినీ బస్సులు సిద్ధం చేశారు.
- ఆయా పార్కింగ్ ప్రదేశాల్లో భక్తుల సౌకర్యార్థం టెంట్లు, కుర్చీలు, మరుగుదొడ్లు, కూలర్స్, మంచినీటి సౌకర్యం, వైద్య శిబిరం తదితర ఏర్పాట్లు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఘనంగా కనకదుర్గ అమ్మవారి పుట్టుక మహోత్సవం



మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో బుధవారం కనకదుర్గ అమ్మవారి పుట్టుక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

10న చందనోత్సవం



వరాహ లక్ష్మీనృసింహస్వామి

కశింకోట: స్థానిక వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో ఈ నెల 10వ తేదీ శుక్రవారం చందనోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు అత్తిలి సత్య వెంకట కేశవ కోదండపాణి తెలిపారు. స్వామిపై ఉన్న చందనాన్ని తొలగించి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, తెల్లవారుజామున 4 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్వామి నిజరూప దర్శనం కల్పిస్తామన్నారు. ఈ సమయంలో భక్తుల గోత్ర నామాలతో అభిషేకాలు నిర్వహిస్తామని తెలిపారు. మధ్యాహ్నం నూతనంగా చందనాన్ని పూసి మళ్లీ దర్శనాలు కల్పిస్తామన్నారు.

వైభవంగా కనకదుర్గ ఆలయ వార్షికోత్సవం



కనక దుర్గఅమ్మవారిని దర్శించుకుంటున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో గ్రామ దేవతల ఉత్సవాలను ఎన్నికల నిబంధనలు మేరకు నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక వేల్పులవీధి చాకలిపేటలో గల కనకదుర్గ అమ్మవారి ఆలయ 9వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని మలసాల భరత్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బాబు, అప్పారావు, సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.


ఏకగ్రీవంగా బార్ అసోసియేషన్ కార్యదర్శి,కోశాధికారి ఎన్నిక

యలమంచిలి రూరల్: స్థానిక బార్ అసోసియేషన్ పాలకవర్గానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న కార్యదర్శి,కోశాధికారి పదవులకు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. కార్యదర్శిగా బి.హరిశంకర్ అలియాస్ సంతోష్,కోశాధికారిగా శ్రీనివాస్ పట్నాయక్‌లు ఎన్నికైనట్టు సీనియర్ న్యాయవాది ఎస్.వి.ఎ. ప్రసాద్ బుధవారం రాత్రి తెలిపారు. ఇటీవల జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఈ రెండు పదవులకు ఎన్నిక జరగలేదు. ఈ పదవులకు బుధవారం ఎన్నిక నిర్వహించగా ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో వారిద్దరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు.

అనకాపల్లి సినిమాలు

ప్రసన్న వదనం	: రాజా
శబరి	: సత్యనారాయణస్క్రీన్-1
మంజుమ్మల్ బోయ్స్	: సత్యనారాయణస్క్రీన్-2
బాక్	: షిర్డిసాయి
ఆ ఒక్కటే అడక్కు	: పర్తిసాయి
రత్నం	: వెంకటేశ్వర
ఫ్యామిలీ స్టార్	: శ్రీసత్య
డీజే టిల్లు-2	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 1,180 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,860	4,860
మొదటి రకం	4,000	4,800
రెండో రకం	3,900	4,380
మూడో రకం	3,400	3,750

సేవాలయాలు

మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేసి చూపించారు. పాలనాపరమైన విషయాలు, అవసరమైన వివిధ సర్టిఫికెట్ల కోసం మండల, జిల్లా కేంద్రాల్లో అధికారుల చుట్టూ తిరగకుండా ప్రజల ఇంటి ముందే వాటిని అందించేందుకు గ్రామ, వార్డు సచివాలయాలతో పాటు ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించారు. ఇందులో భాగంగా అనకాపల్లి నియోజకవర్గంలో 73 గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేశారు. ప్రజలకు అవసరమైన సేవలు ఈ సచివాలయాల ద్వారానే అందుతున్నాయి

– కశింకోట



తాళ్లపాలెంలో నిర్మించిన సచివాలయ భవనం-2

డెవలప్‌మెంట్ వాచ్



ఏఎస్‌పేటలో నిర్మించిన సచివాలయ భవనం



జి. భీమవరంలో నిర్మించిన సచివాలయ భవనం



కొత్తపల్లిలో నిర్మించిన సచివాలయ భవనం



ఉగ్గినపాలెంలో నిర్మించిన సచివాలయ భవనం

కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే రమణమూర్తి రాజు



పెదపల్లి ప్రచారంలో పెద్ద ఎత్తున పాల్గొన్న ప్రజలు , (ఇన్‌సెట్) రామ్‌నగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

యలమంచిలి: రాష్ట్రంలో కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యు.వి. రమణమూర్తిరాజు అన్నారు. యలమంచిలి మున్సిపాలిటీలో రామ్‌నగర్, ఏఎస్సార్ కాలనీ, పెదపల్లి, కొక్కిరాపల్లి, జంపపాలెం, సోమలింగపాలెం గ్రామాల్లో ఆయన బుధవారం విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బూడి ముత్యాల నాయుడును గెలిపించాలని అభ్యర్థించారు. ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించిన జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమణమూర్తిరాజుకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఎంపీపీ బోదెపు గోవింద్,యలమంచిలి మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర,యలమంచిలి పట్టణ సచివాలయ కన్వీనర్ కర్రి శివ,కౌన్సిలర్లు,పడాల కావ్య శ్రీను,దాసరి చిన్నమ్మలు,దుంగా అచ్యుతరావు,వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి కుమార్, గణేష్,రాజు, కర్రి నాయుడు,అయ్యలనాయుడుపాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం అయితేనే పథకాలు అమలు

అచ్యుతాపురం: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ సీఎం అయితేనే సంక్షేమ పథకాలు అమలవుతాయని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తి రాజు తెలిపారు. మండలంలోని తంతడి,రాజన్నపాలెం,ఆవసోమవం,ఇరువాడ గ్రామాల్లో ఆయన బుధవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు కావాలంటే సీఎంగా మళ్లీ జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా గ్రామస్తులు ఎమ్మెల్యేకు బ్రహ్మరథం పట్టారు.



ప్రజలతో మమేకం అవుతున్న ఎంఎల్‌ఏ కన్నబాబు రాజు

నూకాంబిక ఆలయంలో భక్తుల రద్దీ



కశింకోట: స్థానిక నూకాంబిక అమ్మ వారి ఆలయం వరుసగా రెండో రోజు బుధవారం కూడా భక్తులతో కళకళలాడింది. ఈ సందర్భంగా భక్తులు పలు రూపాయాల్లో మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వేగి శివ గణేష్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

వైఎస్ జగన్‌తోనే పేదలకు మేలు



లోవపాలెంలో ప్రచారం చేస్తున్న సుకుమారవర్మ

మునగపాక: సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి జగన్ మోహన్‌రెడ్డికి పట్టం కట్టాలని రాష్ట్ర బీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కాండ్రేగుల చందు కోరారు. మండలంలోని నాగులాపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావడం ద్వారా పేద ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ,ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, యు.వి. రమణమూర్తిరాజులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.సర్పంచ్ జామి చినమ్మలు,వైస్ ఎంపీపీ చిందాడ దేవి, ఎంపీటీసీ మళ్ల కాశీ సురేష్,పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు,పార్టీ నాయకులు మళ్ల సూరప్పారావు,మోహన్ తదితరులు పాల్గొన్నారు. మూలపేటలో సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు విస్తృతంగా ప్రచారం చేశారు. నాగేశ్వరరావు,శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

- ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. బుధవారం రాత్రి మునగపాకలో ఆమె ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి ఆడారి కాశీబాబు,పార్టీ నేత సూరిశెట్టి దుర్గునాయుడు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ప్రచారం

రాంబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గోకివాడలో నియోజకవర్గ కన్వీనర్ ఎస్.వి.సూర్యనారాయణ, దిమిలిలో నగిరెడ్డి మురళీకృష్ణ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. మామిడివాడలో నెట్టిం సత్యనారాయణ, కరెడ్ల నాగరాజు, హరిపురంలో ధూళి అప్పారావు(బుజ్జి) ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. వెల్చూరులో సిరిదళ్ల దేముళ్లు, శ్రీనివాసరావు, నాగరాజు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

- సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేసిన జగన్నను మరోసారి సీఎంగా ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యు.వి. రమణమూర్తిరాజు తనయుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ (తేజ) కోరారు. బుధవారం ఆయన కొండవారపాలెం, గొరపూడి, లోవపాలెం తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి రమణమూర్తిరాజును, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. చంద్రబాబు హామీలను నమ్మవద్దన్నారు. ఇంటి వద్దకే పథకాలు అందాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జి. శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కశింకోటలో..

కశింకోట: మండల కేంద్రం కశింకోటలోని పలు వీధుల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు ఆధ్వర్యంలో బుధవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కనకమహాలక్ష్మి వీధి, మేదర వీధి, పూసర్ల వీధి, ఉప్పునీటి దిబ్బ, ద్వారపురెడ్డివీధి, కస్పావీధి, కంచిపాటి వీధి తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ పథకాల గురించి ఓటర్లకు వివరించారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌లను గెలిపించాలని కోరారు. తాళ్లపాలెంలోని బీసీ కాలనీలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం కార్య నిర్వాహకుడు లగిశెట్టి గణేష్ ఆధ్వర్యంలో గడప గడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు గుమ్మడి నారాయణరావు, ముసిలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి: స్థానిక 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత జానకీరామరాజు ఆధ్వర్యంలో శారదాకాలనీలో బుధవారం ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ సతీమణి నివేదిత గడప గడపకు వెళ్లి ప్రచారం చేశారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, భరత్‌కుమార్‌లను గెలిపించాలని కోరారు ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కార్యదర్శి రాజు, పార్టీ నేతలు పాల్గొన్నారు.



నాగులాపల్లిలో మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ చందు



మూలపేటలో డమ్మీ ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు



గోకివాడలో ప్రచారం చేస్తున్న నియోజకవర్గ సచివాలయ కన్వీనర్ సూర్యనారాయణ



మామిడివాడలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు నెట్టిం సత్యనారాయణ, నాగరాజు తదితరులు



కశింకోటలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు



తాళ్లపాలెం బీసీ కాలనీలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



మునగపాకలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ జయలక్ష్మి



శారదాకాలనీలో ప్రచారం చేస్తున్న మందపాటి సునీత జానకీరామరాజు, ఎమ్మెల్యేఅభ్యర్థి సతీమణి నివేదిత

రక్తదానం చేయండి.. ఆరోగ్యంగా జీవించండి

అనకాపల్లి: ఆరోగ్యవంతులైన యువతీ, యువకులు ఏడాదికి రెండుసార్లు రక్తదానం చేయవచ్చని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ జి.రామ్మూర్తి అన్నారు. నోబెల్ పురస్కార గ్రహీత, అంతర్జాతీయ రెడ్‌క్రాస్ సొసైటీ వ్యవస్థాపకుడు జాన్‌హెన్రీ డ్యూన్‌హంట్ జయంతిని పురస్కరించుకుని స్థానిక న్యూకాలనీలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చని తెలిపారు. అనంతరం 30మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ బి.దయానిధి వెస్ చైర్మన్ హిమజ, జిల్లా కోశాధికారి జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

వైఎస్ జగన్‌ను సీఎంగా మరోసారి ఆశీర్వదించాలి



ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, ఎంపీ బి.వి.సత్యవతిని గజమాలతో సత్కరిస్తున్న వేల్పులవీధి ప్రజలు

అనకాపల్లి : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకునే బాధ్యత మన అందరిపై ఉందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, ఎంపీ బి.బి.సత్యవతి తెలిపారు. స్థానిక 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్న లక్ష్మీ రమేష్, వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు-1 ఉగ్గిన అప్పారావు ఆధ్వర్యంలో బుధవారం గడప గడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా వేల్పులవీధిలో గౌరీపరమేశ్వరులను దర్శించుకుని ప్రత్యేక పూజలుచేశారు. అనంతరం ప్రచారం ప్రారంభించారు. అధిక సంఖ్యలో మహిళలు హారతులు ఇచ్చి దీవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లువేయాలని కోరారు.

బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు మద్దాల రమణబాబు, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ఎ.వి.రత్నకుమారి, పార్టీ సీనియర్ నాయకులు వేల్పుల గణేష్, బొండా శంకరరావు, గొర్లి చిన్న, జెట్టి శ్రీను, మద్దాల చలపతి, కొంకి శ్రీరామ్ మూర్తి, బొండా వాసు, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

మునగపాక: ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్‌ఐ పి.ప్రసాదరావు కోరారు. మండలంలోని చూచుకొండ, పల్లపు ఆనందపురం, గణపర్తి, గంటవానిపాలెం, ఉమ్మలాడ, నాగలాపల్లి, మునగపాక, తిమ్మరాజుపేట, రాజుపేట, కాకరాపల్లి గ్రామాల్లో బుధవారం ప్రసాదరావు ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు.

మండలంలో ఇంతవరకు 850 మందికి పైగా బైండోవర్ చేశామన్నారు. గొడవల్లో ప్రమేయం ఉన్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నేపథ్యంలో మండల వ్యాప్తంగా 144వ సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అందరూ సహకరించాలని కోరారు.



కవాతు నిర్వహిస్తున్న ఎస్‌ఐ ప్రసాద్, పోలీసులు

జిల్లా సమస్యలపై అవగాహన లేని సీఎం రమేష్

- వైఎస్సార్‌సీపీ నేత ఆడారి కిషోర్‌కుమార్

అనకాపల్లి: జిల్లాలో సమస్యలపై బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌కు ఏ మాత్రం అవగాహన లేదని, జిల్లాలో ఎన్ని పోలింగ్ బూత్‌లు ఉన్నాయో కూడా తెలియని పరిస్థితిలో ఉన్నారని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ ఎలక్షన్ ఇన్‌చార్జి ఆడారి కిషోర్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నాన్ లోకల్ వ్యక్తి అనకాపల్లి ఎంపీగా మనకు వద్దని, జిల్లా వాసి అయిన వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును గెలిపించుకునే బాధ్యత ప్రజలపై ఉందని తెలిపారు. ఫోర్జరీ సంతకాలు, షెల్ కంపెనీల ముసుగులో సీఎం రమేష్ ఏకంగా రూ.450 కోట్లకు టోకరావేశారని, టీడీపీ ప్రభుత్వ హయాంలో పలు బోగస్ కంపెనీలను సృష్టించారని పేర్కొన్నారు. సీఎం రమేష్ వల్ల గతంలో తమిళనాడు, కర్ణాటక, పశ్చిమబెంగాల్లో గొడవలు జరిగాయని, ప్రశాంతంగా ఉన్న అనకాపల్లి జిల్లాలో ఇప్పుడు దాడులకు ఉసిగొల్పుతూ గొడవలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఈసీని అడ్డుపెట్టుకుని చంద్రబాబునాయుడు ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలుపుదల చేయడం అన్యాయమన్నారు.

అనంతరం బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ దోపిడీలను వివరిస్తూ రూపొందించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్‌చైర్ పర్సన్ బి.వెంకట సత్యవతి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆడారి కిషోర్ కుమార్

రోటరీ కంటి ఆస్పత్రిలో 8మందికి ఆపరేషన్లు



కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారితో రోటరీ క్లబ్ ప్రతినిధి రవిరామ్ జవహర్

అనకాపల్లి: స్థానిక గవరపాలెం ఏఎంఏవీఎం రోటరీ కంటి ఆస్పత్రిలో బుధవారం ఎనిమిది మందికి ఐవోఎల్ కంటి ఆపరేషన్లు చేసినట్టు క్లబ్ ప్రతినిధి రవిరామ్ జవహర్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం 42 మంది రోగులకు వైద్యులు కంటి పరీక్షలు చేయగా, ఎనిమిది మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్టు చెప్పారు. ఆపరేషన్ల అనంతరం ఐదు రోజులకు సరిపడా ఉచితంగా మందులు అందజేసినట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యుడు కె.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అనకాపల్లి: స్థానిక గవరపాలెం డి-2 సెక్షన్ పరిధిలో గురువారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆశాఖ ఈఈ కె.రాజశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వన్‌వే ట్రాఫిక్ డౌన్, కస్పావీధి, బండిగాడి వీధి, ఎన్టీఆర్ ఆస్పత్రి ఏరియా, కూరగాయల మార్కెట్ ఏరియా, మెయిన్ రోడ్డు ప్రాంతంలో విద్యుత్‌సరఫరాను నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

సాక్షి ఫోకస్

యలమంచిలి.. ప్రగతి లోగిలి

ఎన్నో ప్రత్యేకతలున్నా దశాబ్దాలుగా వెనకబడి ఉన్న యలమంచిలి నియోజకవర్గం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక దినదినాభివృద్ధి చెందుతోంది. హస్తకళల కాణాచిగా, పరిశ్రమల హబ్‌గా మరింత ప్రగతి సంతరించుకుంది. సంక్షేమానికి, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తూ నియోజకవర్గ ఎమ్మెల్యే కన్నబాబు నేతృత్వంలో రూ.కోట్లాది నిధులతో పర్యాటకంగా, మౌలిక వసతుల పరంగా, ఉపాధి పరంగా ముందడుగు వేస్తోంది.


రాంబిల్లిలో నిర్మించిన అధునాతన పీహెచ్‌సీ


ఒంపోలులో నిర్మించిన ఆర్‌బీకే

ఇదేళ్లలో రూ.కోట్లాది అభివృద్ధి పనులు

మౌలిక వసతుల పెంపు

రహదారులు, చెరువుల అభివృద్ధి

పరిశ్రమల రాకతో ఉపాధి అవకాశాలు

అచ్యుతాపురం : సముద్ర తీరానికి ఆనుకొని ఉన్న యలమంచిలి నియోజకవర్గం రూపురేఖలు మారిపోయాయి. మహానేత వై.ఎస్‌. రాజశేఖరరెడ్డి చలవతో సెజ్‌ ఏర్పాటు చేసిన తర్వాత యలమంచిలి నియోజకవర్గం అందరి దృష్టి ఆకర్షించింది. ఇప్పుడు ఆ మహానేత తనయుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో యలమంచిలి ప్రగతిపథంలో విరాజిల్లుతోంది. పర్యాటక పరవళ్లు, ఏటికొప్పాక ఘన వారసత్వానికి గుర్తింపు, తీర ప్రాంత మత్స్యకారులకు ఉపాధి, ఊతమిచ్చే ఫిషింగ్‌ హార్బర్‌తో పాటు అనేక విప్లవాత్మక మార్పులకు సాక్ష్యంగా నిలుస్తోంది. ఈ నియోజకవర్గం పరిశ్రమల హబ్‌గా నిరుద్యోగులకు వరంగా దినదినాభివృద్ధి చెందుతోంది. దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిస్తూ, నీటి వనరుల్ని ఒడిసిపడుతూ ఇటు రైతులకు, అటు పరిశ్రమలకు నెలవై అభివృద్ధి బాటన పయనిస్తోంది.

నాడు శిథిలమైన సర్కారు బడుల స్థానంలో నేడు కార్పొరేట్‌ హంగులతో చక్కని పాఠశాలలు రూపుదిద్దుకున్నాయి. విద్యారంగంలో చక్కని మార్పు రాగా, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడి ప్రజావైద్యానికి బాసటగా నిలిచాయి. సీఎం జగన్‌ పాలన ఈ నియోజక వర్గంలో ఒక సువర్ణ యుగంగా చెప్పుకోవచ్చనడంలో ఎటువంటి సందేహం లేదు.

యలమంచిలి : యలమంచిలి పట్టణంలో దీర్ఘకాలిక సమస్యగా మారిన ఫ్లై ఓవర్‌ నిర్మాణం దాదాపు పూర్తి అయింది. దీంతో పట్టణ ప్రజలు రైల్వే గేట్‌ వద్ద ఎక్కువ కాలం పాటు నిరీక్షించే సమయం ఇక ఆదా అవుతంది. యలమంచిలి ఆస్పత్రిని మరింత అప్‌గ్రేడ్‌ చేసి అనేక వసతులు కల్పించారు.

టీడీపీ హయాంలో అన్నీ అవకతవకలే...

- టీడీపీ హయాంలో యలమంచిలి నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడింది,
- పనులన్నీ అర్థంతరంగా నిలిచిపోయాయి.
- అచ్యుతాపురం–అనకాపల్లి మార్గ విస్తరణను నిలిపివేశారు.
- యలమంచిలిలో ఫ్లై ఓవర్‌ నిర్మాణం పూర్తి కాలేదు.
- మండలానికి ఒక ఇన్‌ఛార్జ్‌ను నియమించి ఎంపీపీ, జెడ్పీటీసీలను డమ్మీలుగా మార్చారు.
- కొండల్ని పిండి చేసి, గ్రావెల్‌ దందా నిర్వహించారు.
- పూడిమడక మత్స్యకారులకు ఇవ్వాల్సిన ప్యాకేజీ విషయంలో ఆర్థిక అవకతవకలు జరిగాయి.
- తంతడి, రాజన్నపాలెం గ్రామాలకు ఆనుకొని ఉన్న భూమిని బార్క్‌ కోసం కేటాయించగా, లబ్ధిదారుల జాబితాలో అవకతవకలు ఉన్నందున పరిహారం లేకుండానే కాలం గడిపారు.
- కొండకర్ల, తంతడి తీరాల పర్యాటక అభివృద్ధిని గాలికొదిలేశారు.


రేబాకలో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్ర భవనం

అభివృద్ధికి ఏరువాక మునగపాక

మండలంలోని కోట్లాది రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మండల వ్యాప్తంగా 21 సచివాలయాలకు గాను రూ.8.8 కోట్లను కేటాయించారు. అలాగే 21 ఆర్‌బీకేలకు ఒక్కో ఆర్‌బీకేకు రూ.22 లక్షలు కేటాయించారు. ప్రస్తుతం 5 ఆర్‌బీకేలు అందుబాటులోకి వచ్చాయి. జల్‌జీవన్‌ మిషన్‌ పథకం ద్వారా 39 పనులకు గాను రూ.17 కోట్ల కేటాయించింది. అలాగే నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా మొదటి విడతగా 24 పాఠశాలలకు గాను రూ.10 కోట్లతో అభివృద్ధి చేశారు. రెండో విడతగా 18 పాఠశాలలకు గాను రూ.8 కోట్లు కేటాయించారు. అలాగే 23 ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి రూ.16.5 కోట్లు ఖర్చు చేశారు.


మెలిపాకలో నిర్మించిన రక్షిత మంచినీటి పథకం

వసతులపల్లి రాంబిల్లి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక సీఎం వై.ఎస్‌. జగన్‌మోహనరెడ్డి పలు అభివృద్ధి పనులు చేయడమే గాక సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేశారు. అమ్మ ఒడి, రైతు భరోసా, వైఎస్సార్‌ ఆసరా, చేయూత తదితర పథకాల లబ్ధిదారులకు ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే జమ చేస్తున్నారు. అంతేగాక నాడు–నేడు పథకంలో పాఠశాలలను కార్పొరేట్‌ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేశారు. పీహెచ్‌సీలను అధునాతనంగా నిర్మించి ఇద్దరేసి వైద్యులను నియమించారు. పూర్తి స్థాయిలో మందులు అందుబాటులో ఉంచారు.


కొండకర్ల ఆవలో బోట్లు ఎక్కేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ఫైబర్‌ గట్టు


పాఠశాలల్లో ఆకర్షణీయమైన బెంచీలు

పారిశ్రామికవాడగా అచ్యుతాపురం

అచ్యుతాపురం మండలం పారిశ్రామికవాడగా అభివృద్ధి చెందింది. 134 పరిశ్రమలు ప్రస్తుతం తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. వీటిలో బ్రాండిక్స్‌, ఆసియన్‌ పెయింట్స్‌, ఎకోహామా వంటి కంపెనీలు నిరుద్యోగులకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. పూడిమడకలో రూ.346 కోట్లతో ఫిషింగ్‌ హార్బర్‌ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఈ హార్బర్‌ నిర్మాణ ప్రాంతానికి చేరుకునేందుకు రహదారి నిర్మాణం పురోగతిలో ఉంది. కొండకర్ల ఆవకు మరిన్ని అదనపు హంగులు కల్పించే విధంగా పర్యాటక శాఖ కృషి చేస్తుంది.


మునగపాకలో రూ.48 లక్షలతో నిర్మించిన బైపాస్‌ రోడ్డు

సంక్షేమ పథకాల వివరాలు

పథకం	లబ్ధిదారుల సంఖ్య	నగదు (రూ. కోట్లలో)
రైతు భరోసా	39,937	207.48
అమ్మ ఒడి	93,947	108.18
చేయూత	15,505	78.49
వైఎస్సార్‌ ఆసరా	53,222	125.46
వైఎస్సార్‌ పెన్షన్లు	38,370	10.31
మనబడి నాడునేడు	158	37.74
కాపు నేస్తం	12,027	18.04
వాహన మిత్ర	8,984	8.98
ఆరోగ్యశ్రీ	19,094	41.01
జగనన్న హౌసింగ్‌	6,901	69.70
సున్నా వడ్డీ	53,207	16.08
జగనన్న చేదోడు	5,516	5.51
విద్యా దీవెన	19,375	45.56
ఇవి కాకుండా...		
పాస్టర్‌లు, ఇమామ్‌	59	రూ.11,58,000
ఈబీసీ నేస్తం	411	రూ.65,39,763
మత్స్యకార భరోసా	423	రూ.42,30,000

ఇవీ అభివృద్ధి పనులు

- అచ్యుతాపురం–అనకాపల్లి రహదారి మరమ్మతు పనులను ఎమ్మెల్యే స్వయంగా పర్యవేక్షించి నిధులను మంజూరు చేయించారు.
- ప్రస్తుతం పనులు జోరుగా సాగుతున్నాయి. ఇది యాభై గ్రామాలకు సంబంధించిన సమస్య.
- మునగపాక–పెదపాడు–కశింకోట రహదారుల అనుసంధానం
- మునగపాక–రాజుపేట రహదారి మరమ్మతులు
- యలమంచిలిలో దీర్ఘకాలిక సమస్య అయిన ఫ్లై ఓవర్‌ పనుల పూర్తి
- పూడిమడక ఫిషింగ్‌ హార్బర్‌కు సంబంధించి రహదారి పనులు
- కొండకర్ల ఆవలో పర్యాటకుల సౌకర్యార్థం ఎంపీ సత్యవతి సహకారంతో ఫైబర్‌ జెట్టీ నిర్మాణానికి చొరవ
- ఏసియన్స్‌ పెయింట్స్‌ సహ కారంతో అచ్యుతాపురం, మున గపాక మండలాల్లో చెరువుల తవ్వకం, సాగునీటి వనరుల అభివృద్ధి
- యలమంచిలిలో చెరువుల అభి వృద్ధి
- అగ్రి ల్యాబ్‌కు కోటి రూపాయల నిధులు, హెల్త్‌ క్లినిక్‌ల నిర్మాణం
- సెజ్‌ పునరావాల కాలనీలో అంతర్గత రహదారులు, డ్రైనేజీల నిర్మాణ పనులు


మునగపాకలో సచివాలయం

సంతోషంగా ఉంది



యలమంచిలి నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో పర్యటించాను. గెలిచిన తర్వాత ఆఫీసుకే పరిమితం కాకుండా సీఎం ఆదేశాల మేరకు ప్రజలతో మమేకం అయ్యాం. దీర్ఘకాలిక సమస్య అయిన యలమంచిలి ఫ్లై ఓవర్‌ నిర్మాణం పూర్తి చేశాం. అచ్యుతాపురం–అనకాపల్లి రహదారి పనులు దాదాపు పూర్తి కానున్నాయి. యలమంచిలిలో చెరువుల అభివృద్ధి చేపట్టాం.

– యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు), ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి

నా మొదటి ఓటు ఎవరికంటే..?

నా ఓటు పథకాలిచ్చే ప్రభుత్వానికే..



మాది ఏఎస్‌ఆర్‌ జిల్లాలోని కూనవరం మండలంలో గల టేకులబోరు గ్రామం. నా పేరు జక్కు మధుమతి. వయసు 20 సంవత్సరాలు. నా తండ్రి అనారోగ్యంతో మరణిచాడు. నేను, నా తల్లి అనురాధ అమ్మమ్మ చెంతనే ఉంటున్నాం. ప్రభుత్వం అందజేస్తున్న విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలతో నేను డిగ్రీ వరకు చదువుకున్నాను. కొత్తగా ఓటుకు దరఖాస్తు చేసుకుంటే ఓటు హక్కు లభించింది. నా విద్యాభివృద్ధికి దోహదపడిన పథకాలకే వేయాలని నిర్ణయించుకున్నాను. సంక్షేమ ఫలాలు ఇస్తున్న ప్రభుత్వం వస్తే వృద్ధులు, పిల్లలు, వితంతువులు, వికలాంగులు ఇలా ఎంతో మంది పేదలకు న్యాయం జరుగుతుందని నా అభిప్రాయం.

మహరాజుల కోట.. జలసిరుల మూట

మహరాజులు ఏలిన ప్రాంతం.. ఖండాంతరాలకు వ్యాపించిన హల్వా రుచి... భక్తుల కొంగుబంగారంగా అలరారే మోదకొండమ్మ.. బీడును సస్యశ్యామలం చేస్తున్న ఏడు జలాశయాలు.. ఇదీ మాడుగుల ముఖచిత్రం.. జిల్లాలోనే అతి చిన్న నియోజకవర్గ కేంద్రమైన మాడుగుల మన్యానికి ముఖద్వారంగా వ్యాపార కేంద్రంగా విరాజిల్లుతోంది. పూర్తిగా వ్యవసాయాధారిత ప్రాంతంగా ప్రత్యేక గుర్తింపు సంతరించుకుంది.


మాడుగుల హల్వా


మోదకొండమ్మ ఆలయం

- మాడుగుల కోట నుంచే వైభవంగా సాగిన పాలన
- ఉత్తరాంధ్రలోనే ప్రసిద్ధి చెందిన మోదకొండమ్మ ఆలయం
- దేశ విదేశాల్లో మాడుగుల హల్వాకు గుర్తింపు
- జిల్లాకే తలమానికంగా 7 జలాశయాలు





మాడుగుల: క్రీస్తు శకం 2వ శతాబ్దంలో మత్స్య వంశ రాజులు పరిపాలన రాజధానిగా మాడుగులను ఎంచుకున్నారు. ఈ ప్రాంతానికి మూడు వైపులా ఎత్తయిన పర్వతాల మధ్య కోట ఏర్పడింది. దీనికి ఆనుకుని వెలసిన గ్రామం మడుగలో ఉండేది. దానిని తొలుత మడుగు అని పిలుచుకునేవారు. రానురాను మాడుగులగా ప్రసిద్ధి చెందింది. స్వాతంత్య్రం ముందు వరకు ఇక్కడ మత్స్య వంశ రాజులు పాలన సాగింది. బ్రిటిష్‌ కాలంలో 1832లో తాలూకాగా మార్పు చెందింది. స్వాతంత్య్ర సమరయోధులు, ప్రసిద్ధి కెక్కిన ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి లాంటి ఎందరో కవులు పుట్టిన నేల మాడుగులలో దసరా, మోదకొండమ్మ ఉత్సవాలు అలనాటి సంప్రదాయాలతో ఇప్పటికీ నిర్వహిస్తుంటారు. నియోజకవర్గంలో ఏడు జలాశయాలు వేల ఎకరాలను సస్యశ్యామలం చేస్తున్నాయి. మాడుగులలో నోరూరించే హల్వాకు వందేళ్ల చరిత్ర ఉంది. దీని రుచి ఖండాంతరాలకు పాకింది.


రాజకీయ పోరు

మాడుగుల నియోజకవర్గ ప్రజలు ఎప్పుడూ ఒకే పార్టీకి పట్టం కట్టలేదు. స్వతంత్ర అభ్యర్థులు సైతం విజయం సాధించిన చరిత్ర కలదు. తొలిసారిగా 1952 ఎన్నికల్లో బోజంకి గంగయ్యనాయుడు శాసనసభ్యుడిగా (కేఎల్పీ పార్టీ) విజయం సాధించారు. 1957లో ప్రజా సోషలిస్టు నుంచి దొండా శ్రీరాంమూర్తి, 1962 తెన్నేటి విశ్వనాథం, 1977లో కురుసా రామునాయుడు స్వతంత్ర అభ్యర్థులుగా, కాంగ్రెసు పార్టీ నుంచి 1967లో మాడుగుల మహరాణి రమాకుమారి దేవి, 1972లో బొడ్డు కళావతి విజయం సాధించారు. 1983 నుంచి 1999 వరకు టీడీపీ నుంచి రెడ్డి సత్యనారాయణ, 2004లో కాంగ్రెసు పార్టీ నుంచి కరణం ధర్మశ్రీ, 2009లో టీడీపీ నుంచి గవిరెడ్డి రామానాయుడు, 2014, 2019లో వైఎస్సార్‌ సీపీ అభ్యర్థిగా బూడి ముత్యాలనాయుడు విజయం సాధించారు.

బలంగా అధికార పార్టీ

టీడీపీకి కంచుకోటగా ఉన్న మాడుగుల నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ పాగా వేసింది. ఇక్కడ పదేళ్లుగా తన ఉనికిని కాపాడుకుని బలంగా ఉంది. నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూలేని విధంగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అభివృద్ధి చేశారు. వర్గ విభేదాలు లేకుండా పార్టీని సమర్థవంతంగా నడిపిస్తున్నారు. అదే ఉత్సాహంతో ఈ దఫా తన కుమార్తె ఈర్లె అనురాధను బరిలో నిలిపారు. మరోవైపు ప్రతిపక్ష పార్టీ టీడీపీ మూడు వర్గాలుగా చీలిపోయింది. అధికార పార్టీకి గట్టిపోటీ ఇవ్వలేక ప్రజలకు జవాబుదారుగా లేక ఎవరికీ వారే యమునా తీరే అన్న చందంగా మారింది. ఈ నేపథ్యంలో వర్గపోరుతో వేగలేక పలువురు కార్యకర్తలు పార్టీకి దూరమయ్యారు. ఈ తరుణంలో వలస వ్యక్తి బండారు సత్యనారాయణమూర్తి బరిలో దిగడంతో పార్టీ శ్రేణుల నుంచి సరైన సహకారం కొరవడిందనే చెప్పాలి.




రైవాడ జలాశయం


ఈర్లె అనురాధ
వైఎస్సార్‌ సీపీ అభ్యర్థి


సత్యనారాయణమూర్తి
టీడీపీ అభ్యర్థి

నియోజకవర్గ స్వరూపం

మాడుగుల నియోజకవర్గంలో చీడికాడ, దేవరాపల్లి మండలాలతోపాటు ఏజెన్సీలో దేవాపురం, సలుగు, ప్రస్తుతం చోడవరం నియోజకవర్గంలో బుచ్చెయ్యపేట, ఎల్‌.సింగవరం, లక్కవరం, తదితర గ్రామాలు ఉండేవి. 2009 పునర్విభజన తర్వాత ఉత్తరాపల్లి నియోజకవర్గంలో ఉండే కె. కోటపాడు మండలాన్ని మాడుగుల నియోజకవర్గంలో కలిపారు. చోడవరం, పాడేరు నియోజకవర్గాల్లో ఉండే గ్రామాలు తొలగించడంతో ప్రస్తుతం మాడుగుల, కె. కోటపాడు, చీడికాడ, దేవరాపల్లి మండలాలతో నియోజకవర్గం ఏర్పడింది.

మాడుగుల నియోజకవర్గంలో ఓటర్లు

1952లో	:	71 వేల మంది
2024లో	:	1,88,989
పురుషులు	:	92,102
స్త్రీలు	:	96,886
ఇతరులు	:	1

ప్రత్యేకతలు

- నిత్యం భక్తులతో కళకళలాడే మోదకొండమ్మ ఆలయం
- దేశంలోనే రెండో దేవాలయంగా గుర్తింపు పొందిన పార్థసారథి ఆలయం
- ఏడు జలాశయాలున్న నియోజకవర్గంగా ఖ్యాతి..
- ఏటా దసరా ఉత్సవాలకు ప్రత్యేకత
- మాడుగుల పసుపునకు అంతర్జాతీయ మార్కెట్‌లో గుర్తింపు ఉంది.
- పాడేరు తర్వాత పిప్పళ్ల వ్యాపారానికి ప్రధాన కేంద్రం ఇదే
- దేవరాపల్లి మండలం తిమిరాంలో పశువుల సంత ప్రసిద్ధి చెందింది.
- దేవరాపల్లి మండలం తెనుగుబూడిలో గురుకుల పాఠశాల, మాడుగులలో డిగ్రీ కళాశాల ఉన్నాయి.
- ప్రధాన జలాశయాలు దేవరాపల్లిలో రైవాడ, చీడికాడలో కొనాం, మాడుగులలో పెద్దేరు, మినీ జలాశయాలు తారకరామ, పాలగెడ్డ, ఉరకగెడ్డ, గొర్రెగెడ్డ ఉన్నాయి.

సామాజిక వర్గ ప్రభావం

వెనుకబడిన కులాలు అధికంగా ఉండే మాడుగుల నియోజకవర్గంలో బీసీ కులాలు గతంలో టీడీపీకి అనుకూలంగా ఉండేవి. 2009 మినహా 2004, 2014, 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌ కుటుంబానికే జై కొట్టింది. ఈ దఫా అదే ఉత్సాహం కనిపిస్తోంది. మాడుగులలో 80 శాతం తూర్పు కాపు సామాజిక వర్గం, చీడికాడలో 65 శాతం కొప్పుల వెలమ, దేవరాపల్లిలో 78 కొప్పుల వెలమ, కె. కోటపాడులో 80 శాతం కొప్పుల వెలమ సామాజిక వర్గాల వారు ఉన్నారు.